

## ప్రేంసాగర్ కుటుంబానికి పరామర్శ

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దుబాయిలో హత్యకు గురైన ప్రేంసాగర్ కుటుంబాన్ని పరామర్శించిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం చైర్మన్ వినోద్ కుమార్

12


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 17 ఏప్రిల్ 2025 | ■ 12 పేజీలు




# నాలుగున్నర దశాబ్దాల తరువాత ఇంద్రవెల్లికి స్వేచ్ఛ

## అడవి బిడ్డల త్యాగాలను గుర్తించిన సర్కార్

8లో



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- 34ఏళ్లుగా నిషేదాజ్ఞల నడుమ అమరులకు నివాళి ■ నేడు అధికారికంగా ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభ
- సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఇంద్రవెల్లి స్థూపానికి మహర్దశ ■ హాజరుకానున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క
- బాధిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం ■ ముస్తాబవుతున్న ఇంద్రవెల్లి స్మారక స్థూపం
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు స్మృతి వనం ఏర్పాటు ■ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ.

తుడుం మోతకు తరలివచ్చిన అడవి బిడ్డలపై పోలీసులు ఎక్కుపెట్టిన తుపాకీ తూటాలకు బలైన అడవిబిడ్డల త్యాగాలను ఎట్టకేలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుర్తించింది. నాలుగున్నర దశబ్దాల తరువాత మొదటి సారిగా ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభను అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 20న ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద సంస్మరణ సభ నిర్వహించనున్నారు. సంస్మరణ సభకు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క హాజరు కానున్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఉట్నూర్ ఎఎస్పీ కాజల్ సింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.




4

## సింగరేణి చరిత్రలో సువర్ణాధ్యాయం

- సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ తొలిమెట్టు..
- రాజధాని నుంచి ఒడిశా నైనీ గనిని వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ప్రజాపాలనలో ఇతర రాష్ట్రాలకు సింగరేణి విస్తరణ
- ఒడిశాలో గని ఏర్పాటు తెలంగాణకే గర్వకారణం..
- సింగరేణిలో నైనీ గని ప్రారంభం ఒక సువర్ణాధ్యాయం
- ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం ■ సీఎం రేవంత్ రెడ్డి

బొగ్గు ఉత్పత్తిలో రారాజు సింగరేణి మరో మైలురాయిని తన ఖాతాలో వేసుకుంది. 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రాల్లో బొగ్గు తవ్వకాలను బుధవారం ప్రారంభించింది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌ను బుధవారం డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వర్చువల్‌గా ప్రారంభించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన బొగ్గు ఉత్పత్తిని సింగరేణి ఇతర రాష్ట్రాలకు విస్తరించి చారిత్రాత్మక ఘట్టానికి తెర లేపింది. కాగా నైనీ బొగ్గు బ్లాక్ వల్ల అంగూల్ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగు పడనున్నాయి. అక్కడ 1600 మెఘవాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో సింగరేణి యాజమాన్యం ఉంది.





5

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై విష ప్రయోగం

- అప్రమత్తతతో 30 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు..
- నీటి ట్యాంకులో పురుగుల మందు కలిపిన దుండగులు
- ఇచ్చోడ మండలం ధర్మపురి పాఠశాలలో ఘటన..
- నిందితుడిపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఇచ్చోడ మండలంలోని ధర్మంపూరి ప్రాథమిక పాఠశాలలో ఓ వ్యక్తి విషప్రయోగం చేసిన ఘటన కలకలం సృష్టించింది. మంగళవారం పాఠశాలకు వెళ్లిన సిబ్బంది పాఠశాల తాళం పగిలిపోయి ఉండటాన్ని గమనించారు. పాఠశాల గదిలో ఉన్న వంటపాత్రలో తెల్లని నీరు నింపి ఉండటం, వాసన రావడంతో అప్రమత్తమైన ప్రధానోపాధ్యాయురాలు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వాసన చూసి వంటపాత్రలు, వాటర్ ట్యాంక్‌లో విషం కలిపినట్లు గుర్తించారు.

## స్పౌజ్ బదిలీలకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

12లో

- ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి అవకాశం
- ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నలుగురు, మంచిర్యాలకు ఇద్దరు రాక ఈ నెల 23న విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు



## అవి ప్లాస్టిక్ బియ్యం కాదు

- సన్న బియ్యంపై సోషయల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసుల నమోదు చేస్తాం
- మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతిలాల్

రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంలో ప్లాస్టిక్ ఉందని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, అసత్య ప్రచారాలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

## నిర్మల్‌లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ అధికారుల స్టింగ్ ఆపరేషన్

- రంగులను కలిపిన చికెన్, కాలం చెల్లిన సాస్..
- వంటల్లో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ వాడకం..
- మోతాదుకు మించి ఆహార పదార్థాల్లో రసాయలు
- హైదరాబాద్ ల్యాబ్‌కు శాంపిల్ల తరలింపు
- రెస్టారెంట్లు, స్వీట్స్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు
- పలువురికి జరిమాన విధించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

వివరాలు 3లో





# ఇందిరమ్మ ఇండ్ల మార్కౌట్ వేగవంతం చేయండి

- తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- తాగునీటి ఎద్దడి ఉన్న చోట్ల బోర్లు వేయించండి
- కార్యదర్శులు ఇండ్ల ప్రక్రియను పరిశీలించాలి
- ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఉదయం 7 నుంచి 11 వరకు నిర్వహించాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం..

**నిర్మల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మార్కౌట్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియ, వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారం, తదితర అంశాలపై ఆమె సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తిచేసిన ఇందిరమ్మ ఇండ్ల మార్కౌట్ వివరాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆమె మండలాల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తొలి దశలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల మార్కౌట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇండ్ల మార్కౌట్ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అర్హతలు, జిఓ కి సంబంధించిన వివరాలపై ఇందిరమ్మ ఇళ్ల కమిటీల సభ్యులకు అవగాహన కల్పించేందుకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్యలు ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని, బోరు బావులు, చేతిపంపులు చెడిపోతే వెంటనే మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అవసరమైన గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీ వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తాగునీటి సరఫరా పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. భూగర్భజలాల లభ్యత తక్కువగా ఉన్న మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకే నిర్వహించాలని, పనుల ప్రదేశాల్లో ఉపాధి హామీ కూలీలకు తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 117 ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధి హామీ నిధుల ద్వారా 228 మరుగుదొడ్లను మంజూరు చేశామని, వాటి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మండల కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు అవసరమైతే తగిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, ఈఈ ఆర్డబ్ల్యూఎస్ సందీప్, పిడి హౌసింగ్ రాజేశ్వర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.




## కొత్త బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో రెండు నూతన బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కెజి నంద గోపాల్ కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మంచిర్యాల కార్పొ రేషన్‌లో ఒక నూతన బార్‌కు, బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఒక కొత్త బార్ లైసెన్సుల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. 2005 ఎక్సైజ్ నిబంధనల ప్రకారం గతంలో రాష్ట్ర వ్యాప్తంగా మూతపడిన 25 బార్ లో స్థానంలో కొత్త బార్‌లకు అనుమతి ఇవ్వగా, జిల్లాలో రెండు బార్‌లకు అవకాశం కల్పించారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల26లోపు కలెక్టరేట్‌లోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల మధ్య సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు రుసుముగా లక్ష రూపాయలు కాగా ఒక్కరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకునే అవకాశం ఉందన్నారు. 29న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ విధానం ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ tgbcl.telangana.gov.in లో సం దర్శించవచ్చునని, మరిన్ని వివరాలకు 87126 58773(జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి), 87126 58788(మంచిర్యాల ఎక్సైజ్ సీఐ), 87126 58785 నెంబర్లలో సంప్రదించవచ్చునన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారం ఏ-1కు మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ లేదా పాన్ కార్డు జిరాక్స్ లను జతపరచాలని, రూ.1 లక్షతో డీడీ తీయాలని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను 26న సాయంత్రం 5 గంటల్లోగా మంచిర్యాల లేక ఆదిలాబాద్ లేక హైద రాబాద్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

## ప్రజల దహార్తి తీర్చేందుకే మజ్జిగ పంపిణీ

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్పి డివి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఏఎస్పీ చిత్తారంజన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు వేసవి దృష్ట్యా పోలీసులు నీకోసం కార్యక్రమంలో భాగంగా మజ్జిగ పంపిణీ చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో రద్దీ ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో మాత్రమే మజ్జిగ పంపిణీ ఎండలు తగ్గేవరకు ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, వాంకిడి సిఐలు రవీందర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ కులగణన చేపట్టాలని పాదయాత్ర

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తా నుంచి హాజీపూర్ మండల కేంద్రం వరకు బుధవారం జాతీయ బిసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. దేశవ్యాప్త బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జన గణన పట్టికలో 34 కాలమ్స్ ఉన్నాయని, కులగణన చేరిస్తే అదనంగా ఒక కాలం మాత్రమే చేరుతుందని, దీనికి రూపాయి కూడా ఖర్చు కాదన్నారు. ఒక కాలం చేర్చడానికి వెనుకాడుతున్న కేంద్ర పాలకులు ఈ దేశంలో ఉన్న 85 కోట్ల మంది బీసీలను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. అలాగే చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి వస్తుందని కేంద్ర పాలకులు భావిస్తున్నారన్నారు. పార్టీలు అనుకూలంగా ఉన్నాయని, తీర్మానం చేసి కేంద్రానికి పంపినప్పటికీ బీసీ కుల గణన చేపట్టకపోవడం అంటే ఇది బీసీల వివక్షగా భావిస్తున్నామన్నారు. పది సంవత్సరాల క్రితమే మేము అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని చెప్పిన బిజెపి మోసం చేసిందని, అలాగే కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పార్లమెంట్ సాక్షిగా బిసి కులగణనకు శ్రీకారం చుడతామని చెప్పి మోసం చేసిన




ఘనత బిజెపికి దక్కిందన్నారు. ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్, బీసీల ఉద్యమ ఆకాంక్ష బీసీలకు రావాల్సినటువంటి ప్రజాస్వామ్యవాట ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ అంశాన్ని తీసుకెళ్లి బీసీ సమాజం ముందు బిజెపిని దోషిగా నిలబెట్టక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, డాక్టర్ రఘునందన్, భీమ్ సేన్, శ్రీపతి రాములు, పెండ్లి రాములు, ఆరెందుల రాజేశం, అంకం సతీష్ , పంపరి వేణుగోపాల్, బండా సతీష్ అందే సంతోష్, చెలిమెల అంజన్న, భీమ్ రావు, సూర్ల శంకర్, ఎల్లాపుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.



## అవి ప్లాస్టిక్ బియ్యం కాదు

- సన్న బియ్యంపై సోషయల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసుల నమోదు చేస్తాం
- మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతిలాల్..

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా ప్లాస్టిక్ బియ్యం సరఫరాపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావాత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేసి సమాజంలో అశాంతి పరిస్థితిని సృష్టించేందుకు కొంత మంది సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని-తిలక్ నగర్‌లో పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిసాయని సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, ఎక్స్ లలో వీడియోలు ప్రచారం చేశారని, ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్పందించి తిలక్ నగర్‌లో ఎటువంటి ప్లాస్టిక్ బియ్యం సరఫరా జరగలేదని, అసత్య ప్రచారం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలను భయాందోళనలకు గురి చేసే అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురి చేసి, సమాజంలో అశాంతి సృష్టించాలనే దురుద్దేశంతో కొంతమంది సామాజిక మాధ్యమాల్లో ప్లాస్టిక్ బియ్యం ఇస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అలాంటి ప్రచారాలు ప్రజలు నమ్మొద్దని ఆయన సూచించారు. జిల్లాలో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిసాయని సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్లాస్టిక్ బియ్యం సరఫరా లేదని అవి పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యమని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

## రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలి

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్షతో పాటు తులం బంగారం కూడా లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 42 మంది లబ్ధిదారులకు రూ. 1,00,116/- చొప్పున ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభించిన రూ.లక్షతో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం తుళం బంగారం కూడా అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



## నిర్మల్ పట్టణంలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ

# అధికారుల స్టింగ్ ఆపరేషన్



- రంగులను కలిపిన చికెన్, కాలం చెల్లిన సాస్..
- వంటల్లో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ వాడకం..
- మోతాదుకు మంచి ఆహార పదార్థాల్లో రసాయలు
- అనుమానిత ఆహార పదార్థాల శాంపిల్లను పరీక్ష నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు తరలింపు..
- రెస్టారెంట్లు, స్వీట్స్ దుకాణాల్లో తనిఖీలు
- నాణ్యతలేని ఆహార పదార్థాల గుర్తింపు..
- పలువురికి జరిమాన విధించిన అధికారులు

**నిర్మల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

బుధవారం జిల్లా కేంద్రంలోని పలు రెస్టారెంట్లు, తినుబండారాల తయారీ కేంద్రాలు, మిఠాయిల డ్రై ఫ్రూట్స్ దుకాణాలలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్కోర్స్ బృందం ఆకస్మిక సోదాలు నిర్వహించింది. ఈ ఫుడ్ సేఫ్టీ సోదాల్లో భాగంగా పట్టణంలోని మయూరి హోటల్, బంధన్ స్వీట్ షాప్, దత్తాత్రేయ నగర్‌లోని డ్రై ఫ్రూట్ హౌస్, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించిన రెస్టారెంట్లలో వంట గది, రిఫ్రిజిరేటర్‌లు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడం జరిగిందని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. సుమారు పదివేల రూపాయల విలువ కలిగిన నిలువ చేసిన కుళ్ళిన మాంసపు ఉత్పత్తులను, హానికర, ప్రమాదకరమైన రంగులను కలిపిన చికెన్, కాలం చెల్లిన సాస్, లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన పన్నీర్, పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచిన కూరగాయలను గుర్తించామన్నారు. పట్టణంలోని ఐఎఫ్‌సి రెస్టారెంట్ నందు స్టోర్ రూమ్‌లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో ఎలుకల విసర్జితాలతో కూడిన సుమారు 5000 రూపాయల విలువగల ముడి సరుకులను గుర్తించి హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆ వస్తువులను ధ్వంసం చేసి, ఎఫ్ఎస్ఎస్ చట్టం 2006ను పాటించనందుకు నోటీసులను జారీ చేశామన్నారు. దత్తాత్రేయనగర్‌లో గల డ్రై ఫ్రూట్ హౌస్‌లో తనిఖీ చేయగా నిర్వాహకులు ఎటువంటి పరిశుభ్రత ప్రమాణాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, అధిక మోతాదులో రంగులు కలిపినటువంటి ఆహార పదార్థాలను, లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన రెడీ టు ఈట్ సేవరీస్ అయినటువంటి కార, మురుకులు పచ్చిబటాని ఇతర అనుమానిత ఆహార పదార్థాల శాంపిల్లను పరీక్ష నిమిత్తం హైదరాబాదులో గల ల్యాబ్ కు పంపించడం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించే విధంగా హానికర ఆహార పదార్థాలను విక్రయించవద్దని, నాణ్యతా ప్రమాణాలను పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. తనిఖీల్లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి, టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి ,స్వాతి, శ్రీషిక, జగన్నాధం పాల్గొన్నారు.










## ఛలో వరంగల్ విజయవంతం చేయాలి

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు ఎండి ముస్తఫా కోరారు. బుధవారం పట్టణంలోని 12, 13వ వార్డులలో చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మండి పడ్డారు. రజతోత్సవ సభల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అను సరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలకు దిశ నిర్దేశం చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అనిల్ కుమార్,మోహన్, కల్పన, యశ్వంత్, కుడికాల శ్రీని వాస్, స్వాతి, సుశీల, కవిత, రాజేశ్వరి, రోజా, అభిషేక్, విశాల్, శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.

## వేసవి సైన్స్ శిక్షణ శిబిరం

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

వేసవి సెలవుల్లో విజ్ఞాన శాస్త్రాలపై ఉచిత సైన్స్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు డీఈఓ యాదయ్య తెలిపారు. 25 నుంచి 8, 9వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మంచిర్యాల జిల్లా సైన్స్ సెంటర్‌లో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 18 నుంచి 20లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.



# ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి





- జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఐదు నిమిషాలు ఆలస్యమైన అనుమతించాలి
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అద నపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబం ధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపెన్ పదవ తరగతి పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓపెన్ పదవ తరగతికి 697 మంది, ఓపెన్ ఇంటర్‌కు 511 మంది విద్యార్థులు హాజరవనున్నారని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఓపెన్ పదవ తరగతి పరీక్షలకు అయిదు నిమిషాల ఆలస్యానికి అనుమతించాలన్నారు. అయితే సిబ్బంది, విద్యార్థులకు మొబైల్ ఫోన్లు అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ దుకాణాలను తాత్కాలికంగా మూసివేయాలని సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా సమయంలో భద్రతా ఏర్పాట్లు ఖచ్చితంగా ఉండాలన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరా నిరవధికంగా ఉండేలా చూడాలని, పరీక్షల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. బెంచీలు, బల్లలు సరైనస్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, డిఈఓ పి. రామారావు, ఎసిజిఈ పరమేశ్వర్, డిఎంహెచ్ఓ రాజేందర్, సిడిపివో నాగమణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సేవాదళ్ పట్టణ అధ్యక్షులుగా ఉదయ్

**మంచిర్యాల, నిర్మల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీ అనుబంధ సేవా దళ్ పట్టణ అధ్యక్షులుగా ఉదయ్ కుమార్‌ను నియమిస్తూ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దల జితేందర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి బుదవారం అందచేశారు. ఈ సందర్భంగా సేవాదళ్ పట్టణ అధ్యక్షులు ఉదయ్ మాట్లాడుతూ... చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, పార్టీ పెద్దలు, సీనియర్ నాయకులు, కార్యర్తలతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎండి హఫీజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నో ముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్, మహిళ అధ్యక్షురాలు గడ్డం రజిని ఎస్సీ, సెల్ పట్టణ అధ్యక్షులు శ్రీను యూత్ కాంగ్రెస్ మం డల ఉపాధ్యక్షులు మాయ తిరుపతి, మైనార్టీ నాయకులు చోటులు పాల్గొన్నారు.



## 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 20 వరకు జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం పేర్కొన్నారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం, చెన్నూర్ ప్రాంతాల్లోని అగ్నిమాపక శాఖ కేంద్రాల ఆధ్వర్యంలో వారం పాటు ఆసుపత్రులు, ఫంక్షన్ హాలు, విద్యాసంస్థల్లో ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు.






# సింగరేణి చరిత్రలో సువర్ణాధ్యాయం

## సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ తొలిమెట్టు



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- నైనీ గనిని వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ప్రజాపాలనలో ఇతర రాష్ట్రాలకు సింగరేణి..
- ఒడిశాలో గని ప్రారంభం తెలంగాణకే గర్వకారణం
- 13 దశాబ్దాల చరిత్రలో 'నైనీ' సువర్ణాధ్యాయం

(ప్రభాత సమాచారం, తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి)

సింగరేణి సంస్థ తన 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించుకోవడం ఒక సువర్ణ అధ్యాయమని, ఒడిశాలో నైనీ గని ప్రారంభంతో సింగరేణి తన విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా భవన్ నుంచి ఒడిశాలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో గని ప్రారంభించడం సింగ రేణి సంస్థకే కాకుండా యావత్తు తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణమన్నారు. బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించి 9ఏళ్లు వివిధ కారణాల రీత్యా ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు.

**ప్రజాప్రభుత్వం కృషితో...**

ఏడాది క్రితం ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులకు సానుకూలత సాధించామన్నారు. ప్రజా ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ





వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకో గలిగామన్నారు. దీంతో ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకు సింగరేణి విస్తరణలో ఒక తొలి అడుగుగా ఆయన అభివర్ణించారు. ఇక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా సింగరేణి విస్తరిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో సింగరేణి గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి, ఒడిశా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి, స్థానిక ఎమ్మెల్యే అగస్థీ బెహరా, ఇతర ప్రజాప్రతినిధులకు తన ధన్యవాదాలు తెలిపారు.

**అంగూల్ అభివృది కి పూర్తి కృషి...**

గత ఏడాది జులైలో తాను ఒడిశా పర్యటన సందర్భంగా అంగూల్ ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన ప్రతీ హామీని త్వరలోనే సింగరేణి సంస్థ అమలు జరుపుతుందని, ఆ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని భట్టి అన్నారు. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అని, కేవలం వాణిజ్యం కోసం పనిచేసే కంపెనీ కాదని, సామాజిక స్పృహతో ఇక్కడ కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు. అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడం కోసం 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీకి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన స్థల సేకరణకు ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సిందిగా కోరారు. ఇతర రాష్ట్రంలో తొలిసారిగా బొగ్గు తవ్వకం ప్రారంభించిన సింగరేణి, ఈ గనిని ఆదర్శప్రాయంగా నిర్వహించాలని కోరారు.

**ఒడిశాలో బొగ్గు గని ప్రారంభించడం చరిత్రాత్మకం...**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ఒడిశాలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఒక చరిత్రాత్మక సందర్భమని, ఇది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ తమ ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గనికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అంగూల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించిన తెలంగాణ డిప్యూటీ సీఎం, సింగరేణి సీఎండీకి శుభాకాంక్షలు తెలిపారు.

**సీఎం, డిప్యూటీ సీఎం చొరవతో...**

నైనీ నుంచి ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించిన సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి చూపిన ప్రత్యేక చొరవ, సహకారం వల్ల నైనీ బొగ్గు బ్లాక్‌ను ఈ రోజు ప్రారంభించుకో గలిగామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ప్రారంభిస్తామని, మరిన్ని అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతామన్నారు. ఈ




కార్యక్రమంలో ప్రజా భవన్ నుంచి ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి ఈడీ ఎస్డీ ఎం.సుభానీ పాల్గొనగా.. నైనీ నుంచిసంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, నైనీ జీఎం శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త శకానికి నాంది

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఒడిశాలో నైనీ గని ప్రారంభించడం ద్వారా సింగరేణి కొత్త శకానికి నాంది పలికిందని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయ మన్నారు. నైనీ బ్లాకులో బొగ్గు తవ్వకాలను ప్రారంభించిన నేపథ్యంలో సింగరేణి సంస్థకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తెలంగాణ సీఎంవో ట్వీట్ చేసింది. సింగరేణి కోసం ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ వల్లే తొలిసారి దేశంలోని ఇతర రాష్ట్రంలోనూ బొగ్గు గనిని ప్రారంభించడం సాధ్యమైందని, ఇది మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

# విద్యార్థులపై విషప్రయోగం

- 30 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు
- నీటి ట్యాంకులో పురుగుల మందు కలిపిన వైనం..
- ఇచ్చోడ మండలం ధర్మపురి పాఠశాలలో ఘటన
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్










**ఇచ్చోడ, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాల వంట గదిలోని నీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల కారణంగానే నిందితుడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 13, 14వ తేదీల్లో సెలవు కావడంతో ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి స్కూల్ వంటగదికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని అక్కడి ఉపాధ్యాయురాలు, సిబ్బంది గమనించారు. వంటగదిలో ఉన్న ఒక బకెట్‌లో నీరు తెలుపు రంగులో ఉండటాన్ని వారు గమనించారు. అక్కడి పాత్రలను చూసి అనుమానం వచ్చిన టీచర్ ప్రతిభ.. వెంటనే గ్రామ సర్పంచి, స్థానిక పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించగా.. నీటిలో పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. ఉపాధ్యాయురాలు ప్రతిభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేశ్ పాఠశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ధర్మపురికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు. ధర్మపురి గ్రామానికి చెందిన సోయం కిస్టును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తానే పురుగుల మందు కలిపినట్లు అంగీకరించాడు. నిర్మల్‌లో ఉన్న తన సోదరుడి ఇంటి నుంచి పురుగుల మందు తీసుకొచ్చి.. పాఠశాల వంట గది తాళాన్ని పగలగొట్టి నీటిలో కలిపినట్లు అంగీకరించాడు. కుటుంబ కలహాల కారణంగా గత కొంతకాలంగా నిందితుడు మానసికంగా ఇబ్బందిపడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించాం. తన ఇంట్లో వారిపై ఉన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేశాం. 329(4), 324 (6), 331(8), 332 సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం" అని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటన వల్ల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదని ఎస్పీ తెలిపారు.

**విద్యార్థులకు తప్పిన పెనుప్రమాదం..**

పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రతిభ విషయాన్ని గ్రహించకపోతే పెను ప్రమాదం చోటుచేసుకునేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సమయాస్ఫూర్తితో వ్యవహరించి విషయాన్ని గ్రాస్తులకు, ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ప్రమాదం తప్పింది. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రమాదం నుంచి విద్యార్థులను కాపాడిన ఉపాధ్యాయురాలు ప్రతిభ అభినందించారు.



## కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్
# చెక్కుల పంపిణీ

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని కల్యా ణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు బుధవారం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. మంచిర్యాల కార్పోరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద మంచిర్యాల నియోజక వర్గానికి చెందిన 253 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.2,54,04,435ల చెక్కులను అందజేశారు. 345 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రూ. 1,17, 22,500 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ దాసోజుకు శుభాకాంక్షలు
# తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా దాసోజు శ్రావణ్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం హైదరబాద్‌లో మర్యాపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలిపారు.



# సోనియా, రాహుల్‌పై గాంధీపై బీజేపీ కుట్ర

## ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈడీ చార్జ్ షీట్ దాఖలు చేయడం వెనుక కేంద్ర ప్రభుత్వం కుట్ర ఉందని బేలా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రుపేష్ రెడ్డి ఆరోపించారు. ఈడీ నోటీసులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ నాయకులు బుధవారం బేల మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేషనల్ హెరాల్ మనీ లాం డరింగ్ కేసులో అగ్ర నేతలు సోనియాగాం ధీ, రాహుల్ గాంధీలను ఏ 1, ఏ 2గా చార్జిషీట్‌లో పొందుపరిచి నిందితులుగా జాబి తాను విడుదల చేయడాన్ని ఖండించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈడీ ద్వారా సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను రాజకీయ కక్షపూరితంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభు త్వం చేస్తున్న కుట్రేనని ఆరోపించారు. బీజేపీ ఎన్ని కుట్ర లు చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ తగ్గదని తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్, నాయకులు రాందాస్ నాక్లే, సంజయ్ గుండావార్, వాంఖడే, ఘన్‌శ్యామ్ పాల్గొన్నారు.



# నూతన పద్ధతులతో అధిక దిగుబడి




## ఏరువాక వ్యవసాయ కోఆర్డినేటర్ నర్సయ్య

**ముథోల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతి ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ పరిశోధన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నరసయ్య అన్నారు. ముథోల్ నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన ఏరువాక కేంద్రం లో రైతు సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా మొక్కజొన్నలో జంటసాల పద్ధతితో రైతులు అధికదిగుబడి సాధించవచ్చునని అన్నారు. అధిక సాంద్రత పత్తి పద్ధతి, వరి పంటలో డ్రీమ్ లీడర్ విధానము, సోయ పంటల్లో విశాలా పంట పద్ధతి పాటించినట్లయితే రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు.రైతులకు భూపోషణ, పర్యావరణ సంరక్షణ, వాటి ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. రైతులు ప్రతి సంవత్సరం విత్తనాలను విత్తే ముందు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. అధిక దిగుబడి కోసం గణాంకాల ఆధారంగా సేంద్రియ, రసాయనిక ఎరువులను వాడాలన్నారు. ఖరీఫ్ రబీ సీజన్‌లో పండించే పంటలకు అధిక మోతాదులో రసాయనిక ఎరువులు ఉపయోగించకూడదని అన్నారు. వ్యవసాయ క్షేత్ర కేంద్రం ద్వారా రైతులకు పంట దిగుబడిపై ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందజేస్తామని వెల్లడించారు. పంట వేసే ముందు జింక్ వేసినట్లయితే పండించే పంటకు పోషక లవణాలు లభిస్తాయని అన్నారు. అలాగే పంట వేసిన తర్వాత పోటాష్ ను వాడినట్లయితే దిగుబడి పెరుగుతుందని వెల్లడించారు. పురుగుల మందుల ప్రభావం తట్టుకునే విధంగా వంగడాలని తయారీ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కార్తీక్, డాక్టర్ విజయ్ కుమార్, జగిత్యాల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ సౌజన్య, వ్యవసాయ మండల అధికారి రచన, ఆదర్శ రైతు సుదర్శన్ పాల్గొన్నారు.



## విద్యార్థులకు గుణాత్మక
# విద్యను అందించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల కేంద్రీయ విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యాలయం పరిసరాలు, గదులను పరిశీలించారు. ఈ సం దర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం ద్వారా జాతీయ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారని, వారి స్ఫూర్తిగా విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలని తెలిపారు. విద్యార్థులు విద్యలో రాణించే విధంగా ఉపాధ్యాయులు కార్యచరణ ప్రకారంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

# భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

భూ భారతి పోర్టల్ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ లతో కలిసి పలు అంశాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూభారతి పోర్టల్ ద్వారా అనేక రకాల భూమి సమస్యల పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. గతంలో సమస్యలు ఉంటే ఆపిల్ చేసుకునే అవకాశం ఉండేది కాదని ప్రస్తుతం అది అందుబాటులోకి వచ్చిందన్నారు. భూభారతిపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈనెల 30 వంకు సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో భూమి సమస్యలు ఉంటే సివిల్ కోర్టు కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు అందజేస్తున్న సన్న బియ్యం పంపిణీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. రైతులు లూస్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని కోరారు. నకిలీ సీడ్స్ అరి కట్టెందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని త్వరలోనే డీలర్లు, సంబంధిత అధికారులతో సమీక్షించి క్షేత్రస్థాయిలో వాటి నివారణకు కృషి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కు సంబంధించి ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గానికి 35 వందల ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వివరించారు. వేసవికాలం దృష్ట తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సమస్య తగ్గిందన్నారు. తాగు నీటి సమస్య ఉన్న ఆవాసలకు ప్రత్యేకంగా నీటి సరఫరాను చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలో ఐటీడీఏ ద్వారా సెంటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేసి నీరు అందించడం జరుగుతుందన్నారు. ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా కాని గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా ప్రజలకు నీరు అందించడం జరుగుతుందన్నారు. ఎండలు తీవ్రతరం అవుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. తాగునీటి సమస్య లేకుండా జిల్లాలో చర్యలు తీసుకునేందుకు సీఎం కోటి రూపాయల నిధులను కేటాయించారని వాటిని తాగునీటి వినియోగానికి ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల రవణపై ప్రత్యేకంగా నిఘ పెట్టడం జరిగిందన్నారు. జిల్లాలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు హుడికిలి, గూడెం, వెంకట్రావుపేట్, వాంకిడి ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. 12.75 లక్షల రూపాయల విలువచేసే 345 కేజీల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మినట్లుగా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి వై.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

**ముథోల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

లోకేశ్వరం మండలంలోని పలు అభివృద్ధి పనుల గురించి ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బోస్లే నారాయణ్ రావు పటేల్ నాయకులతో చర్చించారు. అన్ని గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీలు నూతన దేవాలయ అభివృద్ధి పనులు మరియు దేవాలయ పునర్నిర్మాణా పనుల గురించి నాయకులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు డ్రైనేజీలు దేవాలయ అనేక రకాల పనులు గతా ప్రభుత్వం పెండింగ్‌లు ఉన్నాయని, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పనులు వేగవంతంగా పనులను పూర్తి చేయాలని కార్యకర్తలు కోరారు. లోకేశ్వరం, మండలానికి ఎన్ని నిధులు కావాలన్నా సంప్రదించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క నియోజకవర్గానికి కావాల్సిన నిధులను సమకూరుస్తున్నారని, ప్రతి ఒక్క కార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.

# అగ్నిమాపక వారోత్సవాలు



**జన్నారం, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలో బుధవారం అగ్నిమాపక నివారణ వారోత్సవాలు జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు, పలు ప్రాంతాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సమయాస్ఫూర్తితో వ్యవహరించాలని, వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**దండేపల్లి, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'భూ భారతి'తో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. భూభారతిపై తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణితో గతంలో కొన్ని సమస్యలకు పరి ష్కారం లభించక రైతులు ఇబ్బందులు పడ్డారని, భూ భారతితో మాత్రం చాలా సమస్యలకు పరి ష్కారం లభిస్తుందన్నారు. దీనిని వచ్చే జూన్ నుంచి పూర్తిస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ద్వారా ఉచితంగా అందించిన కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, బీసీవెల్ఫేర్ ఆఫీసర్ పురుషోత్తం, ఏడీఏ అనిత, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, ఆర్ఎస్ఐ భూమన్న, ఇన్చార్జి ఏవో శ్రీకాంత్, బ్యాంక్ మేనేజర్ భూంరెడ్డి పాల్గొన్నారు.





## 18 నుండి జొన్న కొనుగోలు

# కేంద్రాల ప్రారంభం

- మంత్రిని కలిసిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్
- తక్షణ ఆదేశాలు జారీచేసిన మంత్రి తుమ్మల

**ముథోల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ముథోల్ నియోజకవర్గంలో జొన్న పంట ఎక్కువగా సాగవుతున్న తరుణంలో రైతులకు మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను ఎమ్మెల్యే రామారావు పటేల్ హైదరాబాద్‌లో కలిశారు. అదే విధంగా కొనుగోలు పరిమితిని పెంచాలని కోరారు. ఎమ్మెల్యే కలిసిన వెంటనే తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మంత్రి ఫోన్ ద్వారా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎకరానికి కొనుగోలు పరిమితిని పెంచాలని కోరగా ఎకరానికి 14 క్వింటాళ్లను కొనుగోలు చేయనున్నారు. రైతుల సౌలభ్యం కోసం మరింత పెంచాలని కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గానికి సంబంధించిన పలుఅంశాలపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్ కు, ముఖ్యమంత్రికి, జిల్లా ఇంచార్జ్ మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు.

## నేటి నుంచి భూభారతిపై

# అవగాహన సదస్సులు

**ముథోల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ముథోల్ మండలంలోని ఆయా గ్రామాలలో నూతన భూ భారతిపై గురువారం నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నూతన భూ భారతి చట్టం 2025 పైన రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈనెల 17వ తారీఖున చింతకుంట, చింతకుంట తండ, వడ్తాలా, రామ్ టెక్, మచ్కల్ 19న బోరేగావ్, తరోడా, ముద్దుగల్, చందాపూర్ 21న కారేగావ్, జలాల్పూర్ 22న ముథోల్, చించాల, వెంకటాపూర్, పిప్పిరి, గూడూరు 23న ఆష్ట ,హెడ్బిడ్ బ్రహ్మాంగావ్, శెట్టిపల్లి 24న గన్నరం, రూవ్వి తదితర గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులలో భూభారతిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# 'బెదిరింపు రాజకీయాలకు బీజేపీ కేరాఫ్'



**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతూ, రాజకీయం పేరుతో చట్టాలను దుర్వినియోగం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోత్కు సుదర్శన్, పుల్లూరి లక్ష్మణ్, మంద తిరుమల్ రెడ్డిలు కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, శామ్ పిట్రోడాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడి) ఛార్జిషీట్ దాఖలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, అన్ని రాష్ట్రాల్లోని జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయాల ముందు నిరసన తెలపాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కోల్ బెల్ట్ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి ప్రభుత్వానికి, ఈడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... కేంద్ర సంస్థల అధికారాలను బిజెపి దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. భారతదేశ ప్రజాస్వామ్యానికి అవమానంగా, రాజకీయం పేరుతో చట్టాలను ముసుగు చేసుకుని, ప్రతిపక్ష నాయకులపై దాడులు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలపై ఏ1, ఏ2లుగా చార్జ్ షీట్ దాఖలు చేయడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రాజకీయంగా ప్రేరేపితమైనదని స్పష్టమవుతుందని తెలిపారు. ఆ సంస్థ ఆర్థిక లావాదేవీల్లో ఎలాంటి అక్రమం జరగలేదని ఇప్పటికే పలు విచారణల్లో తేలిందని, అయినా ఆర్థిక నేర నిరోధక సంస్థను (ఈడి) బిజెపి ప్రభుత్వం రాజకీయ రీత్యా దుర్వినియోగం చేస్తోందన్నారు. అధికార బిజెపి తన రాజకీయ ప్రత్యర్థులను అణచి వేయడానికి, విచారణ సంస్థలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం బిజెపి వాడుకుంటోందని, ఇది రాజ్యాంగ పరిపాలనకు విరుద్ధమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు - అందవెల్లిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**కాగజ్‌నగర్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని అందవెల్లిలో రూ.10లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద నిధులు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చన్నాపురి గణపతి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మల్లేష్, శ్రవణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పశువుల కోసం ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ విజయ్, డాక్టర్ పరిమళ, డాక్టర్ రాజ్‌కుమార్, గోపాల మిత్ర రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..**

కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. దహెగాం మండల కేంద్రంలోని రైతు వేదికలో 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకు రావడంతో దహెగాం- కోత్మీర్ గ్రామాల మధ్య 12 కిలో మీటర్ల డబుల్ రోడ్డు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. రోడ్డు పనులను నాణ్యతగా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు. దహెగాం మండల కేంద్రంలోని సీనియర్ కార్యకర్త నారాసుధాకర్, నారా లచ్చన్న తల్లి రెండో రోజుల క్రితం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, నాయకులు ధనుం జయ్, తదితరులు పాల్గొన్నారు. పెంచికలపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 35 మంది లబ్ధిదారులకు చెక్కుల ను అందజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో ఘనపురం సుశీల జ్ఞాప కార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర రావు, ఎంపీడీవో ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలు పరిష్కరించాలి

**నిర్మల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

సమస్యలు పరిష్కరించాలని ఫారెస్ట్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొజం అలీఖాన్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయంలో సీసీఎఫ్ శర్వానన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. సమస్యలు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. అసోసియేషన్ సభ్యులు ఎండీ నజీర్‌ఖాన్, రవీందర్, సుందర్, సిబ్బంది తదితరులున్నారు.

# మట్కా నిర్వాహకుడికి రూ.లక్ష జరిమానా

**ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

మట్కా నిర్వాహకుడికి రూ.లక్ష జరిమానా విధించినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడు లతీఫ్, రెహాన్ తండ్రి, కొడుకులు ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్నారు. ఇదివరకు బైండోవర్ చేయగా బుధవారం ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తుండగా పట్టుబడ్డారు. తహసీల్దార్ ఎదుట వారిని హాజరుపర్చగా పది రోజుల్లో రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. రూ.500, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి మండలంలోని వడగామ్ సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలంలోని లక్కుగూడ గ్రామానికి చెందిన కొరెంగా రాము, కొరెంగా హేమంత్ కుమార్, ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ గ్రామానికి చెందిన బాలుడు జుగ్నాక గౌతంలు ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో మోడిగూడ సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. దీంతో కొరెంగా రాము, కొరెంగా హేమంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.



జుగ్నాక్ గౌతంకు స్వల్ప గాయాలయ్యాయి. రాము, హేమంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్



**ఇచ్చోడ, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సై శ్రీకాంత్‌లు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం పక్కా సమాచారం మేరకు కుంటాల ఎక్స్ రోడ్డులో నేరడిగొండకు చెందిన బత్తుల కిరణ్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా 160 గ్రాముల గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. ఆయనను విచారించగా దంసతండా గ్రామానికి చెందిన పెందూర్ లచ్చు అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి తీసుకొచ్చినట్లు తెలిపాడు. కాగా లచ్చును విచారించగా తన వ్యవసాయ భూమిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిపాడు. అతని వద్ద నుంచి 290 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. మొత్తం 450 గ్రాముల గంజాయి విలువ రూ.11,250 ఉంటుందన్నారు.

**మావలలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు..**

గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీకి చెందిన అంబదాస్, గాదిగూడ మండలానికి చెందిన రాజు అనే ఇద్దరు వ్యక్తులు గంజాయిని తరలిస్తుండగా బుధవారం మావల పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. 12 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.



## చెక్ పోస్టును తనిఖీ చేసిన

# మార్కెట్ కమిటీ చైర్మన్

**నిర్మల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని సోన్ వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ ను బుధవారం ఉదయం ఏఎంసీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ ద్వారా వసూలైన సెస్ వివరాలు పరిశీలించారు. చెక్ పోస్ట్ లో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పారదర్శ కంగా విధులు నిర్వహించాలని అలసత్వం వహించవద్దని సూచించారు. మార్కెట్ సెస్ పెంపుదలకు కృషి చేయాలని కోరారు.

# కోర్టుకు హాజరుకాని యువకుడి అరెస్టు

**తాండూర్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

వివిధ కేసుల్లో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న యువకుడిని బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం తాండూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన లింగం రాజు అనే యువకుడిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. కేసుల్లో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న రాజును అరెస్టు చేసి బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు యువకుడిని ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# గుండెపోటుతో పూజారి మృతి

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**



గుండెపోటుతో పూజారి ప్రాణాలు కోల్పోయిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పూజారి పెరు మాండ్ల రమేశ్(75) గత30 సంవత్సరాలుగా శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో పురోహితుడిగా సేవలు అందిస్తున్నారు. గత ఏడాది నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం తన వద్దకు వచ్చిన ఒకరికి పంచాంగం చూ శారు. ఆయన వెళ్లిపోయిన కొద్దిసేపటికే గుండెపోటుతో కుప్పకూలిపోయి మృతి చెందారు. పూజారి మృతితో గ్రా మంలో విషాధ చాయలు అలుముకున్నాయి. పూజారి పెరుమాండ్ల రమేశ్ అకాల మృతి విషయం తెలుసుకున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.

# తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



గోలేటి - కైరిగూడ రహదారిపై కార్మిక కుటుంబాల రాస్తారోకో

**తాండూర్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కార్మిక క్షేత్రమైన మాదారం టౌన్ షిప్‌లో నెల కొన్న మంచినీటి సమస్యను వెంటనే పరి ష్కరించాలని బుధవారం కార్మిక కుటుంబాలు ఆందోళన నిర్వహించారు. రెబ్బెన మండలంలోని గోలేటి సమీపంలో గల కైరిగూడ ఆర్చి వద్దకు కార్మిక కుటుంబాలు తరలివెళ్లి సింగరేణి రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో ఇరువైపుల బొగ్గు టిప్పర్లు, పలు వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. సింగరేణి అధికారులు తక్షణమే రావాలని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని కార్మికులు, మహిళలు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు, డివైజిఎం రెడ్డిమల్ల తిరుపతి, డీజిఎం (సివిల్) భాషా చేరుకుని కార్మిక కుటుంబాలతో చర్చించారు. మాదారం టౌన్ షిప్ లో గత నాలుగైదు నెలలుగా తరుచూ పంపు మోటార్లు సరిగా పని చేయక మంచినీటి సమస్య తీవ్రంగా నెలకొంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో మంచినీటి సమస్యను పరి ష్కరించాలని, లేనిపక్షంలో జీఎం కార్యాలయం ముందు వంటావార్పు చేసి ఆందోళన చేపడుతామని కార్మిక కుటుంబాలు హెచ్చరించారు. ఎస్ ఓటు జీఎం రాజమల్లు స్పందించి మాదారం టౌన్ షిప్‌లో తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని, మూడు రోజుల్లో కొత్త మోటర్లను బిగించి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని ఆందోళన విరమించాలని సూచించారు. దీంతో కార్మికులు, మహిళలు ఆందోళన విరమించి వెనుదిరిగారు. కార్యక్రమంలో ఐఎన్టీ యూసీ నాయకులు పేరం శ్రీనివాస్, చంద్రకుమార్, రామారావు, కాంగ్రెస్ నాయకులు పుట్ట శ్రీనివాస్, లక్ష్మీనా రాయణ, ఏఐటీయూసీ నాయకులు బయ్య మొగిలి, ఎస్.తి రుపతి తదితరులు పాల్గొన్నారు.




■ 34ఏళ్లుగా నిషేదాజ్ఞల నమడుమ అమరులకు నివాళి ■ నేడు అధికారికంగా అమరుల సంస్మరణ సభ
■ సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఇంద్రవెల్లి స్థూపానికి మహర్దశ ■ హాజరుకానున్న మంత్రి సీతక్క
■ బాధిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం ■ ముస్తాబవుతున్న ఇంద్రవెల్లి స్మారక స్థూపం
■ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు స్మృతి వనం ఏర్పాటు వడివడిగా అడుగులు
■ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ.

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

తుడుం మోతకు తరలివచ్చిన అడవిబిడ్డలపై పోలీసులు ఎక్కుపెట్టిన తుపాకి తూటాలకు బలైన అడవిబిడ్డల త్యాగాలను ఎట్టకేలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుర్తించింది. నాలుగున్నర దశబ్దాల తరువాత మొదటి సారిగా ఇంద్రవెల్లి మృతవీరుల సంస్మరణ సభను అధికారికంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఈనెల 20న ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద సంస్మరణ సభ నిర్వహిం చనున్నారు. మొదటి సారిగా అధికారికంగా నిర్వహిస్తున్న సభకు రాష్ట్ర మంత్రి సీతక్క హాజరు కానున్నారు. సభ ఏర్పాట్లను అధికారయంత్రాంగం ముమ్మురం చేసింది. బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఎ పిఒ ఖుష్బు గుప్తా, ఉట్నూర్ ఎఎస్పీకాజల్ సింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి లో అప్పటి పీపుల్స్ వార్ అనుబంధ సంస్థ అయిన గిరిజన రైతు కూలి సంఘం బహీరంగా సభ తలపెట్టింది. పోలీసులు సభకు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి చివరి క్షణంలో రద్దు చేసింది. అనుమతి రద్దు విషయం తెలియని ఆదివాసులు తండోప తండాలుగా ఇంద్రవెల్లి చేరుకొన్నారు. ఇంద్రవెల్లికి భారీ పోలీసు బాలగాలు చేరుకొన్నాయి. ఆదివాసులకు, పోలీ సులకు మధ్య తోపులాట జరిగింది. ఒక పోలీసుకు గిరిజన మహిళ మధ్య మాటా మాటా పెరిగింది. మహిళకు పోలీ సుకు మధ్య జరిగిన ఘర్షణలో పోలీసు కానిస్టేబుల్ గాయపడి ప్రాణాలు విడిచాడు. దీంతో రెచ్చిపోయిన ఆది వాసులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. అధి కారిక లెక్కల ప్రకారం 13 మరణించారు. అనధికారిక లెక్కల ప్రకారం దాని సంఖ్య ఎక్కువగా ఉంది. వందలాది మంది గాయపడ్డారు.

**సంస్మరణ సభకు అడుగడుగునా ఆంక్షలు...**

ఇంద్రవెల్లి సంఘటనలో అసువులు బాసిన ఇంద్రవెల్లి మృత వీరుల సంస్మనార్థం ఇంద్రవెల్లి పొలిమేరల్లో 1983 లో గిరిజన రైతు కూలి భారీ స్మారక స్తూపాన్ని నిర్మించింది. కానీ ఏప్రిల్ 20న ఎలాంటి సంస్మరణ సభ జరుపనియకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. తీవ్ర నిర్భంధాన్ని అమలు చేసేవారు. ఈ నేపత్యంలో1986లో గుర్తు తెలియని వ్యక్తులు స్తూపాన్ని డైనమెట్లతో పేల్చి కూల్చేశారు. దీంతో ఆదివాసుల్లో నిరాశా నిస్పృహలు పెరిగిపోయి ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో 1987లో ఆలంపల్లి సంఘటన జరిగింది. సంఘటన స్థలాన్ని సందర్శించిన అప్పటి దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఇక్కడ నెలకొని ఉన్న పరిస్థితులను ఆరా తీసి అడవి బిడ్డల్లో నెలకొని ఉన్న నిరాశా నిస్పృహలను గమనించారు. ఇంద్రవెల్లి స్తూపాన్ని పునర్మించాలని ఆదేశించారు. వెనుక బడిన ఆదిలాబాద్ జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించారు. గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. నిరుద్యోగ ఆదివాసీ యువతకు ఉద్యోగాలు ప్రకటించారు. అయినా కూడా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభకు ఆంక్షలు యధావిధిగా కొనసాగాయి.

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో స్వేచ్ఛ...**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఆంక్షలు సడలాయి. అమరవీరుల సభ నిర్వాహణకు ప్రభుత్వం ఆదివాసులకు స్వేచ్ఛ నిచ్చింది.

**రేవంత్ రెడ్డి చొరవతో ఇంద్రవెల్లి స్తూపానికి మహర్దశ..**

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఇంద్రవెల్లి స్తూపానికి మహర్దశ వచ్చింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఇంద్రవెల్లి స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దెందుకు నిర్ణయాలు తీసుకొన్నారు. ఇప్పటికే కోటి రూపాయల వ్యయంతో స్తూపం చుట్టూ ప్రహరి గోడ నిర్మించారు, స్తూపం పరిసరాలను అందంగా తీర్చి దిద్దారు. రాబోయే రోజుల్లో పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దెందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆనాడు సంఘటనలో అమరులైన కు టుంబాలను ఆదుకొన్నారు. భూమి, ఇల్లు మంజూరు చేశారు.

**పకడ్బందీగా అమరవీరుల సంస్మరణ సభ ఏర్పాట్లు..**

ఈ నెల 20న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశించారు. బుధవారం ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద సభ ఏర్పాట్లను ఐటీడీఏ పీవో ఖుష్బా గుప్తాతో కలసి పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సంస్మరణ సభకు మంత్రి సీతక్క హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ యువరాజ్, అదనపు కలెక్టర్ శ్యామాలాదేవి ఏఎస్పి కాజల్ సింగ్, చైర్మన్ నాగోరావ్ ఆదివాసి సర్మెడీలు, నాయకులున్నారు.

## హోటళ్లు, దుకాణాల్లో తనిఖీ

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని రవీంద్ర నగర్ గ్రామంలో పలు హోల్ సేల్ దుకాణాలను ఫుడ్ ఇన్స్పెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ వాసురామ్ మాట్లాడుతూ వేసవి కాలం కాబట్టి ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన శీతల పానీయాలు, ఆహార పదార్థాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు.. కోకాకోలా బాటిల్ మరో నాలుగు రోజుల వ్యాలిడిటీ ఉందన్నారు. త్వరలో మర్చి అమ్మాలని సూచించారు. ప్రజలకు కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే హెూల్ సేల్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంపిల్స్ సేకరించి ల్యాబు పంపినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆహార పదార్థాలను కల్తీచేసి అమ్మితే ఉపేక్షిం చేది లేదని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాలు అమ్మినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు...లైసెన్స్ లేని దుకాణాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

## అక్రమ కేసులు వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసన

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతూ, రాజకీయం పేరుతో చట్టాలను దుర్వినియోగం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోత్కు సుదర్శన్, పుల్లూరి లక్ష్మణ్, మంద తిరుమల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ సంబంధించిన మనీ లాండ రింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, శామ్ పిట్రోడాలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఛార్జిషీట్ దాఖలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, అన్ని రాష్ట్రాల్లోని జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ కార్యాలయాల ముందు నిరసన తెలపాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కోల్ బెల్ట్ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఆస్ట్రోనామిక ల్యాబ్‌పై ఓరియంటేషన్ శిక్షణ

**సోన్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా విద్యాధికారి రామారావు చొరవతో బుధవారం ఆస్ట్రోనామిక ల్యాబ్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి వచ్చిన పరిశీలకులు దయానిధి, రిసోర్స్ పర్సన్స్ ఆర్ఎస్ మిశ్రా, నిషిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన నాలుగు ఉన్నత పాఠశాలలకు సంబంధించిన ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయో సైన్స్ టీచర్లకు ఆస్ట్రోనామిక ల్యాబ్ (ఖగోళ అంతరిక్ష ప్రయోగశాల) పై ఒక్కరో జు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సోన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొన్కల్, భోసి, నిర్మల్ రూరల్ (అనంతపేట్) కేజీబీవీలో రూ. 5లక్షలతో ఆస్ట్రోనామికల్ ల్యాబ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థి స్థాయి నుంచే అంతరిక్ష ఖగోళ వస్తువుల గురించి తెలుసుకోవడం, టెలిస్కోప్ పనిచేసే విధానం, పాఠ్యపుస్తకాల్లో వచ్చే పాఠాల్లోని ప్రయోగాలు చేసి చూడడం, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించడం, అవగాహనకు ఆస్ట్రోనా మికల్ ల్యాబ్స్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయోసైన్స్ టీచర్లు శిక్షణలో పాల్గొన్నారు. ఒక్కరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో డీఎస్వో వినోద్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, ఉపాధ్యాయులు వందన, పూర్ణచందర్, భీమేశ్, సోషల్ ఫోరం అధ్యక్షులు రాపర్తి అశోక్, రాజగోపాల్, సుధాకర్ పాల్గొన్నారు.



## యూడైస్ పొరపాట్లు సవరించుకోవాలి

**జైనథ్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

యూడైస్‌లో పొరపాట్లు ఉంటే సవరించుకోవాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జైనథ్ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. జిల్లాలోని ఆయా పాఠశాలలను 59 మంది డైట్ ఛాత్రోపాధ్యాయులతో యూడైస్‌ను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ సమాచారంలో ఏవైనా పొరపాట్లు ఉంటే మార్పులు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం డీఈవోను సన్మానించారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు లస్మన్న తదితరులున్నారు. యూడైస్ నమోదైన వివరాల ప్రకారం విద్యార్థుల సంఖ్య, పాఠశాల భౌతిక వసతులపై డైట్ ఛాత్రోపాధ్యాయులు చేస్తున్న సర్వే పకడ్బందీగా చేపట్టాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని అశోక్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఛాత్రోపాధ్యాయురాలు వెంకమ్మ చేస్తున్న సర్వే తీరును బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ప్లానింగ్ కోఆర్డినేటర్ నారాయణ, వెంకన్న తదితరులున్నారు.

## పురుగుల మందు తాగి ఆత్మహత్య

**బోథ్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

సొనాల మండలం సంపత్నాయక్ తండా గ్రామానికి చెందిన జాదవ్ దేవిదాస్ (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాదవ్ దేవిదాస్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 15న మద్యం సేవించి ఇంటికి వెళ్లగా భార్య సుమన్ బాయి మందలించింది. దీంతో దేవిదాస్ తన వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగి రాత్రి 9 గంటలకు భార్యకు విషయం తెలిపాడు. వెంటనే మండల కేంద్రంలోని సీహెచ్సీకి, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దేవిదాస్ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




# కేజీఎఫ్ ఛాప్టర్ 3 కన్ఫర్మ్

కన్నడ సూపర్ స్టార్ యశ్ నటించిన 'కేజీఎఫ్ ఛాప్టర్ 2' విడుదలై మూడేళ్లు పూర్తి చేసుకున్నది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం 2022 ఏప్రిల్ 14న విడుదలై బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడమే కాకుండా.. రూ.1200 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీకి సంబంధించి హోంబలే ఫిల్మ్స్ ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో 'కేజీఎఫ్ ఛాప్టర్ 3' గురించి హింట్ ఇచ్చారు మేకర్స్. దాంతో 'కేజీఎఫ్ ఛాప్టర్ 3 ఉండబోతుందని అభిమానులు ఉత్సాహంతో ఊగిపోతున్నారు. ఇక వీడియో చివరలో "కేజీఎఫ్ ఛాప్టర్ 3" అనే టైటిల్‌తో పాటు యశ్ రాకీ భాయ్ గొంతుతో "సీ యు సూన్" అనే సందేశం వినిపించడం ఫ్యాన్స్‌లో జోష్‌ను నింపింది. ఈ ప్రాజెక్ట్‌పై ఓ ఇంటర్వ్యూలో యశ్ మాట్లాడుతూ, కేజీఎఫ్ 3 ఖచ్చితంగా ఉంటుంది. ప్రస్తుతం నేను 'టాక్సిక్' మరియు 'రామాయణం' ప్రాజెక్ట్ లపై దృష్టి పెట్టాను. మేము డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో ఈ సినిమా గురించి చర్చిస్తున్నాం. సరైన సమయంలో భారీగా రాబోతున్నాం అని తెలిపారు.

# ట్రోలర్స్‌కు ఖుష్బూ స్ట్రాంగ్ కౌంటర్


ఖుష్బూ

ట్రోలర్లపై నటి ఖుష్బూ తీవ్రంగా స్పందించారు. ఖుష్బూ తాజాగా తన న్యూ లుక్ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే, ఆమె చాలా సన్నగా కనిపించడంతో కొందరు నెటిజన్లు ట్రోలింగ్ చేయడం ప్రారంభించారు. దీనిపై ఆమె గట్టిగా బదులిచ్చారు. ఖుష్బూ తను షేర్ చేసిన ఫొటోలకు 'బ్యాక్ టు ద ఫ్యూచర్' అనే క్యాప్షన్ పెట్టారు. దీనిపై కొందరు నెటిజన్లు ఆమె సన్నబడిన తీరును ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం సన్నగా మారడానికి ఇంజెక్షన్స్ చేయించుకున్నారని, వాటి మాయ వల్లనే ఇలా మారిపోయారని, వాటి గురించి ఫాలోవర్స్‌కు కూడా చెప్పండి అంటూ రకరకాలుగా కామెంట్స్ పెట్టారు. ఈ కామెంట్స్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఖుష్బూ..వారికి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. "మీరెటువంటి మనుషులు? మీరెప్పుడూ మీ ముఖాలను సోషల్ మీడియాలో పంచుకోరు. ఎందుకంటే మీరు అంత అసహ్యంగా ఉంటారు. మీ తల్లిదండ్రులను చూస్తుంటే జాలి వేస్తోంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆయన చాలా మంచివారు


పూజా హెగ్డే

హీరోయిన్ పూజా హెగ్డే కోలీవుడ్ పై ఫోకస్ట్ పెట్టి అక్కడ వరుస సినిమాలు చేస్తూ సందడి చేస్తుంది. ఈ క్రమంలోనే త్వరలో రజనీకాంత్ 'కూలీ'తో పాటు సూర్య 'రెట్రో'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య , డైరెక్టర్ కార్తిక్ సుబ్బరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'రెట్రో' చిత్రం మే 1 థియేటర్స్ లో రిలీజ్ కానుంది. దీంతో రెట్రో ప్రమోషన్స్ గా భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజా హెగ్డే.. తెలుగు ప్రేక్షకులకు ఓ గుడ్ న్యూస్ ప్రకటించింది. 'ఎంతో మంది స్టార్ హీరోలతో డిఫరెంట్ స్టైల్లో సినిమాలు తెరకెక్కిస్తారు కార్తిక్ సుబ్బరాజు. ఆయన మూవీలో నాకు ఛాన్స్ రావడంతో సంతోషంగా భావిస్తున్నాను. ఇక సూర్య గురించి నేను చెప్పేది ఏం లేదు. ఆయన ఎంత మంచివారో తమిళ్ తో పాటు తెలుగు ప్రేక్షకులకు కూడా తెలుసు. ఆయనతో వర్క్ చేస్తున్నంత సేపు చాలా ప్రశాంతంగా ఉంటుంది' అని చెప్పారు. మేము మిమ్మల్ని మిస్ అవుతున్నాం.. తెలుగులో సినిమా చేసి మూడేళ్లు అవుతుంది అని యాంకర్ అడిగిన ప్రశ్నకు.. 'నేను మంచి స్టోరీ, క్యారెక్టర్ కోసం వెయిట్ చేస్తున్నా. షూటింగ్ కోసం సెట్‌లోకి వెళ్తున్నప్పుడు ఎగ్జైట్‌మెంట్ రావాలి. ప్రేక్షకులు ఆ సినిమాతో కొత్త పూజాను చూడాలని నేను ట్రై చేస్తున్నాను. అయితే.. తెలుగులో ఒక సినిమా సైన్ చేశాను. త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను' అంటూ గుడ్ న్యూస్ చెప్పింది పూజా.




# సినిమాల్లోకి ఏఐ టెక్నాలజీ

టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజు సినీ రంగంలో మరో వినూత్న ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నాడు. క్వాంటం ఏఐ గ్లోబల్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత మీడియా కంపెనీని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త వెంచర్ ద్వారా సినీ రంగంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో మే 4న కంపెనీ పేరు సహా పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. ఈ ప్రకటనను దిల్ రాజు యొక్క శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధికారికంగా విడుదల చేసింది. ఈ సందర్భంగా ఓ వీడియోను కూడా షేర్ చేశారు. ఈ కొత్త కంపెనీ వినోద రంగానికి ప్రత్యేకంగా రూపొందించిన అధునాతన ఏఐ సాధనాలను అభివృద్ధి చేసి అందించనుంది. దిల్ రాజు ఈ సహకారం గురించి మాట్లాడుతూ.. సినిమా నిర్మాణంలో ఏఐ సాంకేతికత ద్వారా కొత్త అవకాశాలను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రకటన సినీ అభిమానులు, ఇండస్ట్రీ నిపుణులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# పిచ్చి కామెంట్లు పెట్టకండి


వర్ష బొల్లమ్మ

నటి వర్ష బొల్లమ్మ సతురన్ అనే తమిళ సినిమాతో కెరియర్ స్టార్ట్ చేసి ఆ తర్వాత కల్యాణం అనే చిత్రంతో మలయాళీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 2020లో చూసి చూడంగానే సినిమాతో వర్ష తెలుగులోకి అడుగుపెట్టింది. మూడు భాషలలో ఈ భామ మంచి యాక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. దర్శకుడు అట్లీ దర్శకత్వంలో దళపతి విజయ్ హీరోగా 2019లో విడుదలైన 'బిగిల్' సినిమాలో వర్ష బొల్లమ్మ ఓ ముఖ్య పాత్రలో కనిపించింది. ఈ పాత్రతో వర్ష అందరి దృష్టిని ఆకర్షించింది. 'జాను', 'మిడిల్ క్లాస్ మెలోడీస్', 'పుష్పక విమానం', 'స్వాతిముత్యం', 'ఊరి పేరు భైరవకోన' లాంటి చిత్రాల్లో మెరిసి తన నటనతో ఆకట్టుకుంది వర్ష. వర్ష బొల్లమ్మ కురచ దుస్తులతో దిగిన ఫొటోలు షేర్ చేస్తూ..అదిదా సర్‌ప్రైజ్.. ప్యాంట్ ఎక్కడా అటూ స్టుపిడ్ కామెంట్స్ చేయొద్దు. పంత్ ఇప్పడు లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో ఉన్నాడు అంటూ కాస్త తెలివిగా స్పందించింది. తనని ఎలాగు ప్యాంట్ మరిచిపోయా అని అడుగుతారు కాబట్టి ముందుగానే తన వర్షన్‌లో తెలివిగా రాసుకొచ్చింది. వర్ష ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తన అప్డేట్స్ ని షేర్ చేసుకుంటూ ఉంటుంది. దీంతో ఇన్ స్టాగ్రామ్ లో వర్షకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్నది. ఆమె ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ పిక్స్ కంటే డిఫరెంట్ స్టైల్ లో తనని తాను రిప్రజెంట్ చేసుకుంటూ వెరైటీ ఫొటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఈ పిక్స్ ఫ్యాన్స్ కి వినోదాన్ని అందిస్తూ ఉంటాయి.

# కుబేర నుంచి ప్రోమో సాంగ్



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాలో టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జున, రష్మిక మందన్న కీలక పాత్రలో కనిపించబోతున్నారు. దాంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో జూన్ 20న ఈ చిత్రం విడుదల కాబోతోంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న 'కుబేర' నుంచి అప్డేట్ వచ్చి చాలా రోజులు కావడంతో అభిమానులు నిరాశలో ఉన్నారు. దీంతో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఈ మేరకు ఫస్ట్ సింగిల్‌కు ముహూర్తం ఫిక్స్ చేశారు. ఈ నెల 20న పాట విడుదల కానుండగా.. తాజాగా ప్రోమోను రిలీజ్ చేశారు. 'పోయిరా.. పోయిరా.. పోయిరా మావ.. అరె రాజులాగా దర్జాగా పోయిరా మావ' అంటూ సాగిన ఈ ప్రోమో సాంగ్ ఆకట్టుకుంది. అయితే ఈ నేపథ్యంలో కుబేరా మూవీ టీమ్ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది. అందులో 'మీ సోల్‌ను షేక్ చేసే సాంగ్ 20న వచ్చేస్తుంది' అని వెల్లడిస్తూ హీరో ధనుష్ పోస్టర్ రిలీజ్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సినిమాపై మరింత హైప్ పెంచేసుంది.



## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలందరికీ పని స్థలాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారని జిల్లా డీఆర్డీఏ పీడీ కిషన్ సూచించారు మండలంలోని చిర్రకుంట గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కూలీలందరికీ పని స్థలాల్లో తాగునీరు, నీడ, కల్పించాలని అన్నారు. కూలీలకు అసౌకర్యాలు కలగాకుండా చూడాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో రజియా సుల్తానా, పంచాయతీ సెక్రెటరీ రమేష్, ఈసి మధు, టెక్నికల్ అసిస్టెంట్ రాజమల్లు, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణలు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు



**కాసిపేట, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండలంలోని ముత్యంపల్లి శ్రీ రాజరాజేశ్వర భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజం స్థంభ ప్రతిష్టాపన ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానూ చేరుకొని భక్తిశ్రద్ధలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్ర ఉచ్చారణ నడుమ ధ్వజస్తంభ ఏర్పాటు వైభవంగా కొనసాగింది.

## కొత్త చట్టాలపై మహిళలకు షీ టీం అవగాహన సదస్సు



**కాగజ్‌నగర్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ పట్టణం పెట్రోల్ పంప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జ్ ఎఎస్ఐ సునీత మాట్లాడుతూ.. మహిళలపై హింస, ఈవ్టీజింగ్, సైబర్ క్రైమ్ లకు ఎవరైనా గురయితే వెంటనే షీటీంను సంప్రదించాలని అన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా వేదించిన షీటీంకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థులు, మహిళలు చట్టాలను తెలుసుకోవాలని ఇబ్బందులు ఎదురైతే షీటీం సహాయం కోసం సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ స్ఫూర్తితో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలి

### బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రచారం



**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డా.రాజా రమేశ్ పేర్కొన్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు బుధవారం రామకృష్ణాపూర్‌లో జోరుగా ప్రచారం నిర్వహించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లోని 14, 15,17,18,20 వార్డుల్లో వాల్ పోస్టర్లు అంటించారు. వాల్ రైటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకుడు రామిడి కుమార్, బడికల సంపత్, అలుగుల సత్తయ్య, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, అనిల్ రావు, రేవెల్లి ఓదెలు, పారుపెల్లి తిరుపతి, గడ్డం రాజు, సత్యనారాయణ, చంద్రమౌళి, లక్ష్మారెడ్డి, రంగరాజు, పైతారి ఓదెలు, రమేశ్, యువ నాయకులు రామిడి లక్ష్మీకాంత్, చంద్రకిరణ్, శివ, మణి, గోనె రాజేజెందర్ పాల్గొన్నారు.

**ఉద్యమ స్ఫూర్తిని చాటాలి...**
బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి వచ్చి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ పిలుపు నిచ్చారు. బుధవారం మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో బీఆర్ఎస్ నాయకులతో కలసి రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారం.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ కృషితో చెన్నూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, రాజశేఖర్, బండారు సూరిబాబు, ఎండీ అబ్బాస్, బోరిగం వెంకటేశ్, మద్ది శంకర్, ఈశ్వర్, తోట సురేందర్, జక్కుల సమ్మయ్య, భూపెల్లి కనకయ్య, సీపెల్లి రాజలింగు, రాంసాని శేఖర్, ఎండీ ముస్తఫా, అల్లంల ప్రభాకర్, రాయమల్లు, సీపెల్లి సాగర్, రవికుమార్, కిరణ్, అఖిల్, వినేష్, మహిళా నాయకులు రమాదేవి, సుగుణ పాల్గొన్నారు.

**బెజ్జూర్‌లో వాల్ రైటింగ్..**
బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వాల్ రైటింగ్ చేయిస్తున్నారు. రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ముమ్మరం ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్య క్షుడు బూస సారయ్య, యూత్ కన్వీనర్ తిరుపతి, షంషోద్దీన్, బాబు పాల్గొన్నారు.

## సన్న బియ్యంను సద్వినియోగం చేసుకోవాలి



**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద బడుగు బలహీన వర్గాలకు కడుపునిండా భోజనం అందించేందుకు సన్న బియ్యం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టగా అధికారులు క్షేత్రస్థాయిలో పథకం తీరును ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్ రాజేశ్వర్ మండలంలోని సారంగపల్లి గ్రామానికి చెందిన సన్న బియ్యం లబ్ధిదారురాలు రేశవేన లింగయ్య దంపతుల ఇంట్లో సన్నబియ్యంతో చేసిన వంటను బుధవారం రుచి చూశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసిన సన్నబియ్యంతో చేసిన వంటను రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... ప్రభుత్వం ధనవంతులు తినే సన్నబియ్యంను నిరుపేదల కడుపు నింపాలనే ఆశయంతో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తుందన్నారు. కార్డుదారులు సకలంలో చౌక ధరల దుకాణం వెళ్లి బియ్యం తీసుకొని సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా మండల అదికారులు తమ ఇంటికి వచ్చి భోజనం చేయడం పట్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ చంద్రకళ, నాయకులు తాజుద్దీన్ పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు'




**కాగజ్‌నగర్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అఘాయిత్యాలు పెరిగాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. నల్గొండ జిల్లాకు చెందిన మల్లీశ్వరికి నివాళిగా బుధవారం పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఏడేళ్లు సహజీవనం చేసిన తర్వాత మల్లీశ్వరిని యువకుడు మోసం చేసి వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడని, బాధితురాలు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్మకు కారణమైన నిందితులను ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. మహిళలకు రక్షణ కల్పించలేని సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి, రమాదేవి, లావణ్య, కమల, బీనా మండల్, రింకు మండల్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
మండల మహిళా సమాఖ్యకు మంజూరైన పెట్రోల్ బంక్ ఏర్పాటుకు జిల్లా డిఆర్డిఏ పిడి కిషన్ స్థలాన్ని పరిశీలించారు. బుధవారం తహశీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ రాజేశ్వర్ లతో కలసి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. మండల మహిళా సమాఖ్య కు పెట్రోల్ బంక్ మంజూరు కాగా త్వరలోనే స్థల పరిశీలన పూర్తి చేసి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈజిఎస్ ఏపీఓ రజియా సుల్తానా, ఆర్ఐ గణపతి పాల్గొన్నారు.

## ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణం కాల్టెక్స్ ఏరియాలో టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల వినియోగం రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ మాట్లాడుతు నేరాల నియంత్రణ, పరిశోధనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రతి ఒక్కరు తమ ఇండ్లు, వ్యాపార సముదాయాల వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బుధవారం సూచించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు.





## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

**ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జిషీట్ నమోదు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.

## మొబైల్ ఫోన్ల అందజేత

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ఎవరైనా వ్యక్తులు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న లేదా మిస్ అయిన వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో లేదా సీ ఈఐ ఆర్ వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న 50 మంది బాధితులకు బుధవారం తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నేరస్తులు దొంగలించిన మొబైల్ ఫోన్ల ను దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. అప్రమత్తంగా ఉంటూ వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎనిమిది, కాగజ్‌నగర్ టౌన్‌లో 10, కెరమెరిలో మూడు, వాంకిడి మూడు, రెబ్బెనలో ఎనిమిది, కౌటాలలో ఏడు, కాగజ్‌నగర్ రూరల్‌లో మూడు మొత్తం 50 ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఐటీ కోర్ ఎస్సైలు సౌమ్య, తేజస్విని, ఐటీ కోర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రహరీ కూల్చిన ఇద్దరికి జైలు శిక్ష

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ప్రహరీ, పైప్‌లైన్, గేటు కూల్చివేసిన మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సదానందం గౌడ్, సురేష్‌లకు ఆరు నెలల సాధారణ జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి పదివేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నిరోషా తీర్పునిచ్చినట్లు సీఐ ప్రమోదరావు బుధవారం తెలిపారు. మారుతీనగర్‌లో జరిగిన గొడవలో వీరిద్దరూ జేసీబీతో ధ్వంసం చేశారని పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ముథోల్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ముథోల్ మండలంలోని మాజీ వార్డు మెంబర్ అన్నిస్ ఖాన్ మనుమడు అలాగే మాజీ ఎంపీపీ అఫ్రోస్ ఖాన్ తండ్రి మృతి చెందడంతో ముథోల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బోస్లే నారాయణరావు పటేల్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే లోకేశ్వరం మండలంలో మండల అధ్యక్షుడు సుదర్శన్ తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యం రెడ్డి, శంకర్, అజీజ్, నజీమ్, దుడ్డు ప్రసాద్, చంద్రకాంత్ పాల్గొన్నారు.



# ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి






■ సీపీ అంబర్‌కిషోర్‌ఝా
■ సీపీఆర్‌పై అవగాహన కల్పించిన సీపీ

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

నిరంతరం విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధ తీసుకొని జాగ్రత్తలు వహించాలని రామగుండం పోలీసు క మిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. రామగుండం పోలీసు కమి షనరేట్ పరిధిలో సిబ్బందికి మెగా హెల్త్‌క్యాంప్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు శ్రీకాంత్, డాక్టర్ సునిల్ సిబ్బంది పాల్గొన్నారు. వైద్యులు సిబ్బందికి అన్ని పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా అత్యవసర సమయంలో సీపీఆర్ చేసే విధానాన్ని సిబ్బందికి ఎలా చేయాలో సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే సిబ్బంది ఒత్తిళ్లకు లోనుకాకుండా ఉండాలని వ్యాయామం, యోగా వంటివి చేయాలన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పు అవసరం అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ భూముల్లో నిర్మాణాలు



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ శివారుల్లోని సర్వే నం. 83లోని కేశవనాథ స్వామి ఆలయ భూముల్లో అదే గ్రామానికి చెందిన కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో బుధవారం దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఇటీవల ఆలయ భూ ములకు వేలం నిర్వహించేందుకు తేదీని ప్రకటించారు. గోవిందాపూర్‌లో వేలానికి సంబంధించిన పోస్టర్ అంటించేందుకు దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి వేణుగోపాల్ గుప్తా, బాపిరెడ్డి, ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ రవికిషన్, అటెండర్ రాజేశ్వర్, అలయ అర్చకుడు, కమిటీ సభ్యులు మనోజ్ కుమార్, సుగుణాకర్ వెళ్లారు. ఆలయం భూముల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న వారిని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. ఆలయానికి సంబంధించిన భూమిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను తొలగించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. విషయాన్ని కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామన్నారు.

## భార్యపై గొడ్డలితో దాడి

**కోటపల్లి, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పారం గ్రామానికి చెందిన బానోత్ పున్నం అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అతడి భార్య లక్ష్మికి విషయం తెలియడంతో ఇంట్లో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో బుధవారం సదరు మహిళతో పున్నం సన్నిహితంగా ఉన్నాడని తెలుసుకున్న లక్ష్మి భర్తను తీవ్రంగా మందలించింది. దీంతో కోపోద్రిక్తుడైన పున్నం పక్కనే ఉన్న గొడ్డలితో లక్ష్మిపై దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుమారుడు రాజేశ్ అక్కడికి చేరుకుని 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.





## దేశీదారు స్వాధీనం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లిలోని హనుమాన్ బస్తీలో దేశీదార్ అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు కోట సారమ్మ అనే మహిళ ఇంట్లో తనిఖీ చేయగా 50, 90 ఎంఎల్ దేశీదార్ బాటిల్లు లభించాయని సీఐ దేవయ్య తెలిపారు. బాటిల్లను సీజ్ చేసి, దేశీదార్ అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని కేఆర్కే కాలనీకి చెందిన బైక్ దొంగ షేక్ నదీంను రెండవ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలను పదిరోజుల కాల వ్యవధిలో దొంగిలించాడు. ఇందిరానగర్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి విచారించగా, మూడు వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. అదే విధంగా జైనథ్‌కు చెందిన రద్దివార్ ప్రశాంత్ ముథూట్ ఫైనాన్స్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 9న కార్యాలయం ఎదుట బైక్ పార్కింగ్ చేయగా, సాయంత్రం వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శివాజీచౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి నిందితుడిని విచారించగా బైక్ చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ఊరపోచమ్మ విగ్రహ జీర్ణోద్ధరణ

**బోథ్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కౌట గ్రామంలో జరిగిన శ్రీ ఊర పోచమ్మ విగ్రహ జీర్ణోద్ధరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహానికి తన వంతు సహాయంగా రూ. 51 వేలు అందజేశారు. గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను వీడీసీ సభ్యులు శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, సోమేశ్, రాం రెడ్డి, రమణ రెడ్డి, చిన్నా రెడ్డి, లస్మన్న, ప్రతాప్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కక్ష్య పూరితంగానే ఏఐసీసీ నేతలపై కేసులు




**మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖ**

**మంచిర్యాల, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)**

కక్ష్య పూరితంగానే ఏఐసీసీ అగ్రనేతలపై కేసులు నమోదు చేస్తున్నారని మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీ సీ, టీపీసీసీ పిలుపు మేరకు బుధవారం మంచిర్యాల కార్పోరేషన్ పరిధిలోని ఐటీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ హెరాల్ విషయంలో కక్ష పూరితంగా ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్ షీట్‌లో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈడీ ద్వారా సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను రాజకీయ కక్షపూరితంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వోఆర్ చట్టంపై అవగాహన ఉండాలి





## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)
భూమి సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టంను ఏర్పాటు చేసిందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభార తిపై ఏ ర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సుకు హాజరై ప్రసంగించారు. గతంలో ధరణిలో కొన్ని లోపాలుండడం వల్ల భూ సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పుడు ప్రభు త్వం రూపొందించిన భూ భారతిలో వాటిని సరి చేసిందన్నారు. భూ భారతిలో రెవెన్యూ రికార్డులను సరిగ్గా మెయింటెన్ చేస్తారని, ప్రతి సంవత్సరం భూముల రికార్డులను తీసి ఆ ఫైళ్లను తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరుస్తామన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్న భూభారతిలో సైతం ఎలాంటి లోపాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. భూమికి సంబంధించి ఏదైనా తప్పు జరిగితే సంబంధిత తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లవచ్చని అక్కడ పరిష్కారం కాకపోతే ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చని అక్కడ కూడా న్యాయం జరక్కపోతే కలెక్టర్ కు అప్పీలు చేసు కునే అవకాశం భూభారతిలో ఉందని తెలిపారు. గతంలో ధరణిలో లేని సాదా బైనామాలకు భూ భారతిలో ఆప్షన్ ఉందని రైతులు భూ సమస్యలపై కలెక్టర్ వరకు రాకుండా తహసీల్దార్ వద్దనే పరిష్కారమయ్యే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఏడీ శ్రీనివాస్, పొనకల్ పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి, తహసీ ల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఏపీఎం బుచ్చన్న, సీసీ నా గలక్ష్మీ, బుక్ కీపర్ శాంతి, వ్యవసాయాధికారులు, కేంద్రాల నిర్వహకులు, ఏఈవోలు త్రిసంధ్య, అక్రమ్, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, మోహన్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

# స్పౌజ్ బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి అవకాశం
- ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నలుగురు, మంచిర్యాలకు ఇద్దరు రాక ఈ నెల 23న విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)
స్పౌజ్ బదిలీలకు ప్రభుత్వం మరోసారి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల 38 మంది స్పౌజ్ ఉపాధ్యాయులు (భార్య, భర్త) ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పౌజ్ బదిలీలకు సంబంధించి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరుగురు సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నలుగురు స్కూల్ అసిస్టెంట్లు బదిలీపై రానుండగా, ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు ఇద్దరు సాంఘిక శాస్త్రం ఎస్ఏలు బదిలీపై వెళ్లనున్నారు. 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. సంబంధిత జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఈనెల 22న రిలీవ్ అయి వారికి కేటాయించిన జిల్లాలో 23న విధుల్లో చేరాలని విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఇటీవల మ్యూచువల్ బదిలీలకు సంబంధించి ఉత్త ర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్ జిల్లాకు 24 మంది మ్యూచువల్ బదిలీపై రానుండగా, అదే సంఖ్యలో ఇతర జిల్లాలకు ఇక్కడి నుంచి వెళ్లనున్నారు. మంచిర్యాల నుంచి సీనియర్ అసిస్టెంట్ డీఈవో కార్యాలయానికి రానుండగా, ఇక్కడినుంచి ఒకరు మంచిర్యాలకు వెళ్లనున్నారు.

# క్రీడలతో మాసిక ఒత్తిడిని జయించవచ్చు

## కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)
నిత్యం ఒత్తిడితో కూడుకున్న పోలీసు ఉద్యోగంలో దాన్ని నియంత్రించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆధునికరించిన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను ఎస్పీ డీవీ శ్రీనివా స్ రావు, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్.పి. ప్రభాకర్ రావు, ఏఎస్పి చిత్తరంజన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు ఆడడంతో ఒత్తిడి నుండి ఉపశమనం పొంది మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు దోహదపడతాయని అన్నారు. నిత్య జీవితంలో క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని, శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసం కలగడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పోలీస్ హెడ్ క్వార్ట ర్స్‌లో ప్రారంభించిన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను పోలీసు అధికారులు, ఉద్యోగులు సద్వినియోగంచేసుకోవాలన్నారు. విజయ్ భాస్కర్ రెడ్డి, పెద్దన్న, అంజన్న, సీఐలు రవీందర్, శ్రీధర్ పాల్గొన్నారు.



# 18న ఆదిలాబాద్‌కు మంత్రి పొంగులేటి రాక

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి పోర్టల్‌ను జిల్లా లో ప్రారంభించేందుకు రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 18న జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే భోరజ్ మండలం పూసాయి గ్రామంలో ఏర్పాటు చేయనున్న భూ భారతి రెవెన్యు సదస్సు ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భూ భారతి ఆర్ఓఆర్ చట్టం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, రెవెన్యూ డివిజ నల్ అధికారి వినోద్ కుమార్, డీఎస్పీ జీవన్ రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవో ఉన్నారు.



విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# ప్రేంసాగర్ కుటుంబానికి పరామర్శ



సోన్, ఏప్రిల్ 16 (ప్రభాత సమాచారం)
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల దుబాయిలో పాకిస్తాన్ వ్యక్తి చేతిలో హత్యకు గురైన మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేంసాగర్ కుటుంబాన్ని బుధవారం గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం చైర్మన్ వినోద్ కుమార్ పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దుబాయి రాయబార కార్యాలయానికి ఫోన్ చేసి మాట్లాడి మృతదేహాన్ని త్వరగా తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, మాజీ సర్పంచ్ వినోద్ కుమార్ తదితరులున్నారు. కాగా తాజాగా దుబాయిలో చోటుచేసుకున్న ఘటనతో పాటు గల్ఫ్ దేశాల్లో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, వారికోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో కమిటీ ఆధ్వర్యంలో అధ్యయనం చేసి నివేదిస్తామని గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ కమిటీ అడ్వైజరీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.